దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ


నందన్ ఎలక్ట్రానిక్స్
సెల్ నెం. 9949010118
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కామెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ
UNICAM SYSTEMS, CP PLUS enhancing vision, Panasonic, HIKVISION
Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05


| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 185 | ది. 26-9-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 185 | Date : 26-9-2025 | Friday | Pages : 8 | Rs.1/- |


# భవిష్యత్తులో పన్నులు మరింత తగ్గిస్తాం : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ , సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** రష్యాతో బంధం కాలపరీక్షలకు తట్టుకొని బలపడిందని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆయన ఉత్తర్‌ప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధానగర్ లో మొదలైన ట్రేడ్‌షో లో జరిగిన సభలో మాట్లాడారు.ఈ వాణిజ్య ప్రదర్శనకు కూడా మాస్కో భాగస్వామిగా వ్యవహరిస్తోందన్నారు. దేశ స్వయంసమృద్ధిలో ఉత్తరప్రదేశ్ పాత్రను ఆయన కొనియాడారు. భారత్‌లో తయారయ్యే మొబైల్ ఫోన్లలో అత్యధికం ఇక్కడినుంచే వస్తున్నాయన్నారు. సెమీకండక్టర్ రంగంలోను భారత్ స్వయంసమృద్ధి సాధించాలని పేర్కొన్నారు. భారత్‌లోనే చిప్ నుంచి షిప్ వరకు అన్నీ తయారుచేయాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు. పన్నుల తగ్గింపు కొనసాగుతుందన్నారు. "భారత్‌లో తయారయ్యే మొబైల్ ఫోన్లలో 55 శాతం యూపీ నుంచే వస్తున్నాయి. సెమీకండక్టర్ రంగంలో కూడా ఈ రాష్ట్రం బలోపేతమైంది.




ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని మన దళాలు భావిస్తున్నాయి. మనం బలమైన రక్షణ రంగాన్ని అభివృద్ధి చేసుకొంటున్నాం. రష్యా సాయంతో ఇక్కడ ఏర్పాటుచేసిన ఫ్యాక్టరీలో ఏకే-203 రైఫిల్స్ ఉత్పత్తి మొదలుపెడతాము. యూపీలో డిఫెన్స్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. జీఎస్టీలో మార్పులు నిర్మాణాత్మక సంస్కరణలు. అవి భారత వృద్ధికి రెక్కలు తొడుగుతాయి. జీఎస్టీ రిజిస్ట్రేషన్ సరళంగా మారింది. పన్ను వివాదాలు గణనీయంగా తగ్గాయి. ఎంఎస్ఎంఈలకు వేగంగా రీఫండ్స్ లభిస్తున్నాయి.2014 ముందు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను దాచిపెట్టేందుకు.. దాని మిత్రులు ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారు. మేము ప్రజల ఆదాయం, పొదుపు పెంచాము. ఇక్కడితోనే ఆగిపోం. మన ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడాన్ని కొనసాగిస్తాం. భవిష్యత్తులో కూడా పన్నులు తగ్గిస్తాము. జీఎస్టీ సంస్కరణల ప్రక్రియ కొనసాగుతుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్

- బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేస్తున్నాం
- అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం
- విద్యార్థులకు టీచర్లు నైతిక విలువలు బోధించాలి
- ఉపాధ్యాయులూ నిత్యం అప్డేట్ అవుతూ ఉండాలి
- మెగా డీఎస్సీ విజేతల సభలో సీఎం చంద్రబాబు
- మెగా డీఎస్సీని సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి లోకేష్ బృందానికి సీఎం అభినందనలు
- కొత్త టీచర్లకు నియామక పత్రాలు అందచేసిన ముఖ్యమంత్రి







**అమరావతి,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిరుద్యోగులు, ఈ ఏడాది డీఎస్సీలో క్వాలిఫై కాని వారంతా ప్రిపేర్ అవుతూ ఉండాలని సూచించారు. ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని... దాని కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి నారా లోకేష్ కు సీఎం చంద్రబాబు చెప్పారు. మెగా డీఎస్సీలో విజేతలకు ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాలను జారీ చేసే కార్యక్రమం గురువారం రాష్ట్ర సచివాలయం సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన 15,941 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. అన్ని జిల్లాల నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు కుటుంబ సభ్యులతో సహా కొత్తగా రిక్రూట్ అయిన టీచర్లు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టాను. అవినీతి లేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం... టీచర్ల నియమించాం. 150 రోజుల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టిన మంత్రి నారా లోకేష్ బృందాన్ని అభినందిస్తున్నాను. ఇక టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నాను. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ అని చెప్పాను... దాన్ని నిజం చేస్తున్నాం. రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాం.. 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టాం.. 1,96,619 ఉద్యోగాలిచ్చాం. ఇక పైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది." అని సీఎం చెప్పారు.

**చదువు చెప్పడంలో మహిళలే బెస్ట్..** "సూపర్ సిక్స్ హామీల్లో మొదటి హామీ యువతకు 20 లక్షల ఉద్యోగాలివ్వడమే. దాంట్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేశారు. ఉద్యోగం సంపాదించాలన్న మీ కోరిక తీరింది... పేదరికం లేని సమాజం చూడాలనేది నా కోరిక. పేదరికం లేని సమాజాన్ని చూడాలంటే... విద్యతోనే సాధ్యం.. దాన్ని టీచర్లే నెరవేర్చాలి. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరు. ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారు. అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాం. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం. స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం పథకం అమలు చేస్తున్నాం. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా.. వారందరికీ రూ. 15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చారు... ధరలు తగ్గించారు. దసరా, దీపావళి పండుగలను ఆనందంగా జరుపుకోవాలి. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి... ఆదాయం పెరుగుతుంది.. సంక్షేమం సజావుగా సాగించవచ్చు." అని చంద్రబాబు అన్నారు.

**విద్యా రంగాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు...** "తొలిసారిగా సీఎం అయినప్పటి నుంచి విద్య పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఐటీ చదవమని ఆ రోజుల్లో చాలా మందికి చెప్పాను... కొందరు నా మాటపై నమ్మకంతో పట్టణాలకు వచ్చి చదువుకున్నారు. ఆ రోజు చక్కగా చదువుకున్నవారు... ఇప్పుడు విదేశాలకు వెళ్లారు.. బాగా స్థిరపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులందరూ కలిసి ఎంత మంది టీచర్లను నియమించారో... నేను ఒక్కడినే అంత మంది టీచర్లను నియమించాను. ఇదీ నేను విద్యా రంగానికి ఇచ్చే ప్రాధాన్యత. విద్యా రంగాన్ని నేను ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు.. నిర్లక్ష్యం చూపలేదు. టీచర్లుగా బాధ్యతలు తీసుకున్న మీరంతా బాగా పని చేయాలి... మంచి పేరు తీసుకురావాలి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా టీచర్లంతా పని చేయాలి. విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నాం... సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేరెంట్-టీచర్ మీటింగులు నిర్వహిస్తున్నాం. మన బడి-మన భవిష్యత్ పేరుతో మౌళిక సదుపాయాల కల్పన చేపడుతున్నాం. టీచర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా టీచర్ల బదిలీలు పూర్తి చేశాం. నారా లోకేష్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారు... ఇది వినూత్నంగా ఉంది. స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు, పుస్తకాలు ఇచ్చాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

# తెలంగాణలో భారీ వర్షాలు..

## -కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్న ముఖ్యమంత్రి
- అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించాలని సూచన
- విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు సూచన



**హైదరాబాద్,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** రానున్న రెండు రోజుల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆయన కీలక సూచనలు జారీ చేశారు. కలెక్టర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, అలాగే ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాగా, ఈ రోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల డుమ్మా..

- ఫోన్లు చేసి పిలిపించాలని విప్ లను ఆదేశించిన సీఎం చంద్రబాబు
- అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల గైర్హాజరుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- సమావేశం మొదలైనప్పుడు సభలో కేవలం 30 మంది సభ్యులే హాజరు
- గైర్హాజరైన ఎమ్మెల్యేలను ఫోన్లు చేసి పిలిపించిన చీఫ్ విప్
- వచ్చినవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోవడంతో సీఎం అసహనం
- సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కావాలని స్పీకర్ కూడా హెచ్చరిక
- కూటమి ఎమ్మెల్యేలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చంద్రబాబు ఆదేశం



**అమరావతి,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలకు సభ్యులు సరిగా హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు ఎమ్మెల్యేల గైర్హాజరు, వచ్చినా మధ్యలోనే వెళ్లిపోతున్న తీరుపై ఆయన తీవ్ర అసహనం ప్రదర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సభలో సభ్యుల బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే, శాసనసభ సమావేశం ప్రారంభమయ్యే సమయానికి సభలో కేవలం 30 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దీనిని గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, వెంటనే చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును పిలిచి సభ్యుల గైర్హాజరుపై ఆరా తీశారు. సభకు రాని ఎమ్మెల్యేలకు తక్షణమే ఫోన్లు చేసి పిలిపించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో విప్‌లు రంగంలోకి దిగి ఫోన్లు చేయడంతో, 17 మంది సభ్యులు హుటాహుటిన సభకు చేరుకున్నారు.అయితే, అలా వచ్చిన వారిలో కూడా కొందరు సభ్యులు కీలక చర్చలు జరుగుతుండగానే సభ నుంచి నిష్క్రమించడం ముఖ్యమంత్రి ఆగ్రహాన్ని మరింత పెంచింది. "ఈ విధంగా ఉంటే సమావేశాలు ఎలా జరుగుతాయి? ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో గెలిపించారు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదు" అని చంద్రబాబు సభ్యులను ఉద్దేశించి అన్నారు. ఇదే విషయంపై స్పీకర్ ఎ. అబ్దుల్‌ఖాదర్ కూడా స్పందించి, సభ్యులందరూ సమావేశాలు ముగిసే వరకు సభలో ఉండాలని, హాజరు విషయంలో రాజకీయ పార్టీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యేలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఘటనపై విపక్షాలు కూడా స్పందిస్తూ, అధికార పక్ష సభ్యుల క్రమశిక్షణా రాహిత్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సీఎం కఠినంగా వ్యవహరిస్తారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ప్రకటన
మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 536/2024
Between :
చెక్కా రంగయ్య ... వాది
మరియు
అంకాని రమేష్ .. ప్రతివాది
TO.,
ప్రతివాది అడ్రస్ :
అంకాని రమేష్,
S/o.(లేటు) చినవాకలయ్య,
పల్లెతాళ్లపాలెం, H.O.తాళ్లపాలెం,
మచిలీపట్నం మండలం,
కృష్ణాజిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది 06.10.2025 నకు వాయిదా అయి యున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10.30 ని. లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 06-10-2025
చంద్రాల గోపీకృష్ణ
వాది తరపున న్యాయవాది,
మచిలీపట్నం.

హార్థిక శుభాకాంక్షలు



యదుకుల శ్రేయోభిలాషి, కర్నూలు జిల్లాలో ఓ ప్రత్యేకమైన శైలితో నలుగురికి అండగా ఉండే శ్రీశైలం యాదవ అన్నదాన సత్ర అభివృద్ధి కమిటీ ముఖ్య బాధ్యులు,"మన" అన్న
శ్రీ లక్కీ టు రాంపుల్లయ్య యాదవ్
అన్న (2024 కర్నూలు లోకసభ ఎన్నికల కాంగ్రెస్ ఐ అభ్యర్థి) మరియు లక్కీ టు నరసింహ అన్న ఇరువురు వివిధ పార్టీల్లో ఉన్న వారి అనుచరులతో నేడు వైయస్సార్సీపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగనన్న పిలుపు మేరకు వైసీపీ లో చేరిన సందర్భంలో శుభాకాంక్షలు...



పి ఎల్ పి యాదవ్
బి ఎ, బి ఎల్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,
వైయస్సార్సీపి బీసీ సెల్
మార్కాపురం

# సాహితీ ఇన్‌ఫ్రా కేసులో కీలక మలుపు..

# ఈడీ విచారణకు జగపతిబాబు

**హైదరాబాద్,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** నటుడు జగపతిబాబు ఈడీ ఎదుట హాజరయ్యారు. ఆయనను నాలుగు గంటల పాటు అధికారులు విచారించినట్లు సమాచారం. సాహితీ ఇన్‌ఫ్రా కేసులో జగపతిబాబును ఈడీ విచారణకు పిలిచింది. సాహితీ తరపున పలు ప్రకటనలో నటించిన జగపతిబాబుకు, సాహితీ కంపెనీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయన్న ఆరోపణల మధ్య ఆయనను ఈడీ విచారించింది. సాహితీ లక్ష్మీనారాయణ కంపెనీ అకౌంట్‌లో నుంచి జగపతిబాబుకు నగదు బదిలీ అయినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ అయినందున జగపతిబాబును పిలిచి విచారించినట్లు వెల్లడించారు.

# సీఎంను 'కుప్పం ఎమ్మెల్యే' అన్న వైసీపీ ఎమ్మెల్సీ... మండలిలో రగడ

- సీఎం చంద్రబాబును 'కుప్పం ఎమ్మెల్యే' అని పిలిచిన వైసీపీ సభ్యుడు రమేశ్ యాదవ్
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ ఎమ్మెల్సీలు... క్షమాపణ చెప్పాలని డిమాండ్
- వివాదాస్పద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన ఛైర్మన్
- జగన్‌ను 'పులివెందుల ఎమ్మెల్యే' అనడానికి ప్రతిగా వైసీపీ కౌంటర్
- ఇకపై మంత్రులను నియోజకవర్గాల పేర్లతోనే పిలుస్తామని స్పష్టీకరణ



**అమరావతి, సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో గురువారం నాడు తీవ్ర రగడ చెలరేగింది. ముఖ్యమంత్రి చంద్రబాబును వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ ఒకరు 'కుప్పం ఎమ్మెల్యే' అని సంబోధించడం సభలో దుమారానికి దారితీసింది. అధికార టీడీపీ సభ్యులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో వాడివేడి వాతావరణం నెలకొంది. 'సూపర్-6' పథకాలపై జరిగిన లఘు చర్చ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిని 'కుప్పం ఎమ్మెల్యే' అని ప్రస్తావించారు. దీంతో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్సీలు ఒక్కసారిగా తమ స్థానాల నుంచి లేచి నిరసన తెలిపారు. సభా నాయకుడైన ముఖ్యమంత్రిని అగౌరవపరిచేలా మాట్లాడారని, రమేశ్ యాదవ్ వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి సభా నాయకుడు అనే విషయాన్ని వైసీపీ సభ్యుడు ఎలా మర్చిపోతారు?" అని ఆయన ప్రశ్నించారు. సభ్యుల నిరసనతో జోక్యం చేసుకున్న మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు... రమేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని నిర్ధారించారు. వాటిని సభా రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. సభ్యులందరూ నిబంధనలకు కట్టుబడి, సభా సంప్రదాయాలను గౌరవిస్తూ హుందాగా ప్రవర్తించాలని ఆయన సూచించారు. అయితే, ఈ వ్యాఖ్యల వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. టీడీపీ నేతలు ప్రతిపక్ష నేత జగన్ ను పదేపదే 'పులివెందుల ఎమ్మెల్యే' అని సంబోధించడంతో, దానికి ప్రతిగానే తాము కూడా ముఖ్యమంత్రిని, మంత్రులను వారి వారి నియోజకవర్గాల పేర్లతో పిలవాలని నిర్ణయించుకున్నట్లు వైసీపీ ఎమ్మెల్సీలు చెబుతున్నారు. ఇకపై చంద్రబాబును 'కుప్పం ఎమ్మెల్యే' అని, లోకేశ్‌ను 'మంగళగిరి ఎమ్మెల్యే' అని, పవన్ కల్యాణ్‌ను 'పిఠాపురం ఎమ్మెల్యే' అని పిలుస్తామని వారు అసెంబ్లీ లాబీ చిట్ చాట్ లో సంభాషణలో చెప్పినట్టు తెలుస్తోంది. అంతకుముందు చర్చలో, ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే 'సూపర్-6' సూపర్ హిట్ అంటూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని రమేశ్ యాదవ్ ఆరోపించారు. దీనికి టీడీపీ సభ్యులు బదులిస్తూ, తమ ప్రభుత్వం హామీలను అమలు చేస్తుండటం వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు.

# ఎడిటోరియల్

## లోకేష్ గ్రాఫ్ పైపైకి.. తాజా అప్డేట్ ఇదే...!


టీడీపీ యువ కిశోరం.. మంత్రి నారా లోకేష్ గ్రాఫ్.. గత మూడేళ్లుగా పైపైకి పుంజుకుంటున్న విషయం తెలిసిందే. యువగళం పాదయాత్రకు ముందు.. తర్వాత.. ఆయన గ్రాఫ్‌ను పరిశీలిస్తే.. తారా జువ్వను తలపిస్తోందన్న వాదన పార్టీ నాయకుల్లోనే కాదు.. ప్రభుత్వ వర్గాల్లోనూ వినిపిస్తోంది. యువగళం పాదయాత్ర ద్వారా మాస్ నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత.. ప్రభుత్వంలో మంత్రిగా చోటు దక్కించుకున్న నారా లోకేష్.. మరింతగా తన పనితీరుతో దూసుకుపోతున్నారు. పెట్టుబడుల కల్పన, డీఎస్సీ నిర్వహణ వంటి వాటి ద్వారా.. పాలన పరంగా లోకేష్ మార్కులు వేయించు కుంటున్నారు. మరోవైపు..ఎక్కడ ఏ సమస్య ఉన్నా. నేనున్నానంటూ ఆయన స్పందిస్తున్న తీరు, ప్రజలకు చేరువ అవుతున్న విధానం వంటివి ప్రజల్లో బలమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఇక, తాజాగా నారా లోకేష్ గ్రాఫ్.. అంతర్జాతీయ స్థాయికి చేరింది. రాష్ట్ర విద్యారంగంలో జరుగుతున్న వినూత్నమైన మార్పులకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల నుంచి ప్రశంసలు దక్కాయి. ప్రపంచ బ్యాంకు, సమగ్ర శిక్షలో అమలవు తున్న సాల్ట్ ప్రోగ్రాం కార్యక్రమాలు వినూత్నంగా అమలవుతున్నాయని, ఈ కార్యక్రమాలు దేశానికే కాకుండా దక్షిణ ఆసియా మొత్తానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని ఏకంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల నుంచి మంత్రి నారా లోకేశ్ కు ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా లీప్ కార్యక్రమానికి సాల్ట్ ప్రొగ్రాంను లింక్ చేసి.. రాష్ట్రంలో మంచి ఫలితాలు సాధిస్తున్న తీరు.. వీటిని అనుసంధానం చేస్తున్న మంత్రి నారా లోకేష్ స్పందన బాగున్నాయన్నది ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు చెబుతున్న మాట. సో.. దీనిని బట్టి.. ఇంట గెలవడమే కాదు.. రచ్చ గెలవడంలోనూ.. నారా లోకేష్ దూసుకుపోతున్నారని అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అంత ఈజీగా ఎవరినీ ప్రశంసించ రు. కానీ, తొలిసారి.. ఈ గౌరవం నారా లోకేష్‌కే దక్కింది. అంతేకాదు.. ఆయన పనితీరుకు కూడా మంచి మార్కులే పడ్డాయి. ఈ పరిణామాలతో నారా లోకేష్ గ్రాఫ్ మరింత పుంజుకుందని.. ఆయన ఫ్యూచర్ కూడా అద్భుతంగా ఉంటుందని అంటున్నారు. ఏదేమైనా.. ఇన్నటి వరకు ఉన్న లెక్క వేరు.. తాజాగా మారిన లెక్కతో లోకేష్ గ్రాఫ్ మరింత పెరిగిందన్నది వాస్తవమేనని విశ్లేషకులు కూడా చెబుతున్నారు.

## కాత్యాయనీ దేవిగా జగన్మాత దర్శనం



**విజయవాడ పశ్చిమ, సెప్టంబరు 25:(వార్తా ప్రభ ప్రతినిధి)**కెబిఎన్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని గురువారం కాత్యాయనీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యపూజ, మంటపార్చనల అనంతరం వేదపండితులు గరిమెళ్ళ శరవణ దీక్షితులు, దేవరకొండ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సామూహిక చండీహోమాలు జరిగాయి. సామూహిక కుంకుమార్చనలో 100 మంది ముత్తయిదువులు పాల్గొని, కాత్యాయనీదేవికి అర్చనలు చేసారు. హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య, ట్రెజరర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, కెబిఎన్ కళాశాల సెక్రటరీ డాక్టర్ తూనుకుంట్ల శ్రీనివాసు తదితరులు యాగంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీహోమాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి.

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంతో దర్శనమిచ్చిన చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మిఅమ్మవారు



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం చిట్టి నగర్ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ అన్నపూర్ణాదేవి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ దసరా సందర్భంగా నాలుగవ రోజున శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకునీ తరించినట్లు చెప్పారు. ప్రతినిత్యం పలువురు ప్రముఖులు దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని వివరించారు. విశాఖ కో-అపరేటివ్ బ్యాంక్ 1 టౌన్ బ్రాంచ్ మేనేజర్ అడపా సత్యనారాయణ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఆలయ కమిటీవారు సత్యనారాయణకి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరము సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధానకార్యదర్శి డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు, గౌరవ అధ్యక్ష్యులు బెవర సూర్యనారాయణ, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (అడ్వకేట్), కార్యనిర్వాహణకార్యదర్శి కొరగంజి భాస్కరరావు, కార్యవర్గసభ్యులు మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పణుకు రమ, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాత్యాయని దేవి అలంకృత అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వస్తున్న భక్తజనం




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)** దేవీ మహాత్మ్యంలో దుర్గామాత తొమ్మిది రూపాలలో ఒక రూపం కాత్యాయనీ దేవి. పురాణాల ప్రకారం ఈ అవతారం మహర్షి కాత్యాయనుడు చేసిన దీర్ఘ తపస్సు ఫలితంగా ప్రత్యక్షమైంది. అశుభ శక్తుల వినాశనం, సత్యధర్మాల స్థాపన కోసం శక్తి స్వరూపిణి కాత్యాయనీ అవతరించింది.

**కాత్యాయనీ అవతారం – పురాణ విశేషాలు:**మహిషాసురుడు అనే రాక్షసుడు లోకాలను జయించి, దేవతలను తరిమికొట్టాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అతని మీద యుద్ధం చేయలేకపోయారు. అప్పుడు వారి శక్తులన్నిటినీ సమన్వయించి కాంతిరూపిణిగా కాత్యాయనీని సృష్టించారు. మహర్షి కాత్యాయనుని ఆశ్రమంలోనే ఆమె అవతరించిందని చెప్పబడుతుంది. అందువల్ల ఈ అవతారం "కాత్యాయనీ" అనే పేరుతో ప్రఖ్యాతి పొందింది. పురాణ గాథల ప్రకారం కాత్యాయనీ దేవి సింహవాహనంపై ఆరూఢమై, చతుర్భుజాలతో, ఒక చేతిలో ఖడ్గం, మరొక చేతిలో త్రిశూలం, మూడో చేతిలో కమలం, నాలుగో చేతితో అభయముద్రలో భక్తులకు రక్షణ వాగ్దానం చేస్తుంది. ఆమె దివ్య కాంతి రాక్షససేనలను సమూలంగా నాశనం చేసి, మహిషాసురుని సంహరించింది.

**ఆరాధనలో విశిష్టత:**శారదా నవరాత్రుల్లో ఆరవ రోజున కాత్యాయనీ అమ్మవారిని పూజించడం ముఖ్యంగా సూచించబడింది. పురాణ వచనాల ప్రకారం ఆమెను ఆరాధించే వారు, అడ్డంకుల తొలగింపును, వివాహయోగ ప్రాప్తిని, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని, ఆధ్యాత్మిక శక్తిని పొందుతారని నమ్మకం. ప్రత్యేకించి వివాహయోగం ఆలస్యమవుతున్న యువతులు కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించితే త్వరితగతిన శుభముహూర్తం లభిస్తుందని స్కాంద పురాణం, మార్కండేయ పురాణం గాథలు సూచిస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం నవరాత్రుల నాల్గవ రోజు కాత్యాయనీ ఆలంకారం ఘనంగా జరుగుతుంది. తెల్లని పట్టు వస్త్రాలలో, సింహవాహనంపై దివ్యరూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. దేవాలయ పరిసరాలు జై కాత్యాయనీ మాతా నినాదాలతో మారుమ్రోగుతాయి. పండితుల అభిప్రాయం ప్రకారం..."కాత్యాయనీ దేవి శక్తి అవతారం మాత్రమే కాదు, స్త్రీ శౌర్యానికి ప్రతీక. భక్తిలో అచంచల విశ్వాసం ఉంచిన వారికి ఆమె సర్వ రక్షణ ప్రసాదిస్తుంది" అని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఇక నేటి సమాజంలో స్త్రీ శక్తి ప్రాముఖ్యం పెరుగుతున్న సందర్భంలో కాత్యాయనీ అవతారం ఆరాధన మరింత విశిష్టత సంతరించుకుంటోందని పండితులు విశదీకరిస్తున్నారు.

# పెరిగిన భక్తుల తాకిడి...

- కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సహా... ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ
- భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనా నాయక్.





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నవరాత్రి ఉత్సవాలు నాలుగవ రోజుకు చేరుకున్నాయి. రెండవ రోజు నుంచి క్రమంగా భక్తుల సంఖ్య పెరగడం ప్రారంభించింది. నాలుగవ రోజు గురువారం శ్రీ కాత్యాయనీ దేవి అలంకృత అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రి పర్వతానికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న "స్త్రీ శక్తి" పథకం ప్రభావం వల్ల మహిళా భక్తుల సంఖ్య బాగా పెరిగింది. భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రియల్ టైం డేటా ఆధారంగా ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తుండటంతో పాటు భక్తులకు అవసరమైన కనీస అవసరాలతో పాటు మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలు అన్ని దశల్లోనూ భక్తుల అవసరాలను గమనిస్తున్నారు. ప్రధానంగా క్యూలైన్లలోని సాధారణ భక్తులకు మంచినీరు, పాలు పంపిణీతో పాటు ఎవరైనా అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలో అవసరమైన వైద్య సహాయం వంటి అంశాలతో సహా దర్శనానంతరం లడ్డు విక్రయ కేంద్రాలు, అన్న ప్రసాద స్వీకరణ కేంద్రాలలో రద్దీని తగ్గించేందుకు అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిందిగా క్షేత్రస్థాయి అధికారులను ఆదేశిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో అమ్మవారికి సేవ చేస్తున్నామనే భక్తి భావంతో విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు తమ తమ విభాగాలకు చెందిన సిబ్బందిని ఆదేశించారు.

# నున్నలో ఏళ్ళతరబడి గ్రహణం వీడకుండా పెండింగులో ఉన్న జర్నలిస్టుల భూమి

- గన్నవరం ఎమ్మెల్యే కి ఉన్న పెద్ద మనస్సు పాలకులందరికీ ప్రసాదించు బెజవాడ కనకదుర్గమ్మ తల్లీ
- అసెంబ్లీలో జర్నలిస్టుల సమస్య ప్రస్తావించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- ఇకనైనా 19 ఏళ్ళ ఎదురు చూపులు ఫలించేనా

**(యేమినేని వెంకట రమణ)**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబరు 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జర్నలిస్టులహౌసింగ్ సొసైటీ సమస్యలపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డవెంకట్రావుకి ఉన్న పెద్ద మనస్సు పాలకులందరికి ప్రసాదించు బెజవాడ కనకదుర్గమ్మ తల్లీ అంటూ బెజవాడ విలేకరులు అమ్మవారిని వేడుకొంటున్నారు. 2008 నుండి అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల పరిస్థితి గన్నవరం ఎమ్మెల్యే అసెంబ్లీలో బుధవారం మరో సారి ప్రస్తావించడంతో విలేకరుల్లో ఇన్నాళ్లూ ఎదురు చూస్తున్న ఆశలు మరోమారు చిగురించినట్టయ్యింది. పోలవరం ప్రాజెక్టును నిర్మాణం లాగా , అంతంలేని టి వి సీరియల్స్ లాగా దింపుడు కల్లం ఆశలాగా ఉన్న ఈ భూమి సమస్య ఇప్పటికైనా ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలకులు ఓ దారికి తెస్తారనే ఆశలు జర్నలిస్టుల్లో పెరిగాయి. ముఖ్యంగా ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట పరస్పర సహకారహౌస్ బిల్డింగ్ సొసైటీకి 2008లో జీవో మేరకు నున్నలోకేటాయించిన భూమికి సంబంధించి లాంఛనాలు పూర్తి చేసినా సొసైటీకి అప్పగించడంపై యార్లగడ్డ ప్రస్తావించారు. తన నియోజకవర్గంలోనినున్న గ్రామంలో జర్నలిస్టుల ఇళ్ల సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాన్ని గుర్తు చేశారు. ఈ సమస్యను గత శాసనసభసమావేశాల్లోనూ తాను ప్రభుత్వ దృష్టికి తెచ్చానని గుర్తు చేశారు. 2008లో జర్నలిస్టుల సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన భూమిఆక్రమణలకు గురవుతోందన్నారు. ఆయనే జర్నలిస్టుల పరిస్థితి వివరిస్తూ మూడున్నర ఎకరాల్లో సుమారు 2 ఎకరాల 30 సెంట్లు మాత్రమే మిగిలి వుందని స్పష్టంచేశారు. ఎందరో ప్రజల సమస్యలను వార్తలు ద్వారా ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించబడిన సందర్భాలు కోకొల్లలు. కానీ ""అందరికీ శకునం చెప్పే బల్లి కుడితి తొట్లో పడి చచ్చిందన్న చందంగా "" విలేకరుల సమస్యలు దయనీయంగా మారిందని పాలకులూ గ్రహించండి. జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గుర్తు చేశారు. గత శాసనసభ సమావేశాల్లో గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి కూడా ఈ విషయమై హామీ ఇచ్చిన అంశాన్ని వెంకట్రావు ప్రస్తావించారు. సమస్యను ముఖ్యమంత్రిదృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సభాముఖంగా ఆయన కోరారు. ముఖ్యంగా ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్-తహసీల్దార్ సుగుణ ఆధ్వర్యంలో భూమి కొలతలు కూడా జరిగాయి. ఆతరువాత క్రమంలో కొన్ని ఆక్రమణలను కూడా తొలగించారు. ఇంకా మరికొన్న ఆక్రమణలను న్యాయ పరమైన చిక్కులను తొలగించి భూ బకాసురులు చెరలో నుండి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ యంత్రాంగానికి-ఈ ఫైల్ ఎన్నో సార్లు వెళ్ళినప్పటికీ తుది రూపం తీసుకుని రాలేక పోతున్న వైనం ఉంది. 150 మంది జర్నలిస్టులు సొసైటీలో -నమోదవగా, ఇప్పటికే సుమారు పది మంది దాకా జర్నలిస్టులు మృతి చెందారు. గత 19 సంవత్సరాలుగా జర్నలిస్టులు తమ సొంతఇంటి కలను నెరవేర్చుకోలేని పరిస్తితి ఇక్కడే జరుగుతున్నది. ఇందుకు సంబందించిన సాంకేతిక, భౌగోళిక అంశాలు చాలా వరకు పూర్తయ్యాయి. అయితే స్తలాన్ని స్వాధీనం చేయడం, ఇళ్ళ నిర్మాణాలకు పచ్చ జండా ఊపుతోంది. పరిశ్రమల స్థాపన పేరుతో, ఇంకోటో, మరోటోపేరిట భూములను కారు చౌకగా కేటాయిస్తున్న ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్ట పరస్పర సహకార హౌస్ బిల్డింగ్ సొసైటీకిసంబందించిన విషయంలో ఎందుకు తాత్సారం చేస్తుందో అర్థం కావడం లేదన్నది చర్చ జరుగుతోంది. ఎన్డీయే కూటమి లో తెదేపా ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర భవిష్యత్ కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారు. వాటిల్లో భాగంగా జర్నలిస్టుల ఈ అంశాన్ని కూడా ఒకసారి పరిగణనలోకి తీసుకోవాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

## సామాన్య భక్తులకు పెద్దపీట... నినాదాన్ని నిజం చేద్దాం

### క్యూ లైన్ లో వెళ్లి బంగారు వాకిలి నుంచి దర్శనం చేసుకున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చి.. వారికి సత్వర దర్శన భాగ్యం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలను గౌరవిస్తూ సాధారణ భక్తుని వలె క్యూ లైన్ ద్వారా బంగారు వాకిలి నుంచి దర్శనం చేసుకున్నానని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శ్రీ కాత్యాయనీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన జగన్మాతను గురువారం ఆయన దర్శించుకున్నారు. వీఐపీ దర్శనాలకు దేవస్థానం కేటాయించిన సమయాలలో మాత్రమే దర్శనం చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోలేని సందర్భాలలో సాధారణ భక్తులతో సమానంగా దర్శనం చేసుకోవడం సైతం దేవుని సేవలో భాగమేనన్నారు. క్యూ లైన్ లో ఉన్న భక్తులతో తాను మాట్లాడినప్పుడు దేవస్థానం, జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని భక్తులు చెప్పిన విషయం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. దుర్గామాత అనుగ్రహంతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని లోకమాతను ప్రార్థించినట్లు తెలిపారు.

## స్వచ్ఛోత్సవ- స్వచ్ఛత హి సేవలో భాగంగా "ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్"



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ సూచనల మేరకు గురువారం ఉదయం భవాని ఘాట్లో స్వచ్ఛోత్సవ- స్వచ్ఛత హి సేవలో భాగంగా "ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్" కార్యక్రమాన్నీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్ నిర్వహించారు. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఒక రోజు ఒక గంట అందరూ కలిసి స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్న పిలుపుమేరకు విజయవాడలో నగర పౌరులు అధికారులు సిబ్బంది అందరూ కలిసి దాదాపు 200 మంది భవాని ఘాట్లో పారిశుధ్య నిర్వహణ నిర్వహించి వ్యర్థాలను సేకరించి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాసన్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కేబీఎన్ కాలేజ్ ఎన్సిసి విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.

## మా ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా దసరా ఉత్సవాలు

### *సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసలు*



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 25: (వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రతిఏటా దసరా మహోత్సవాలను మా ఆర్ట్స్ వారు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా నిర్వహించడం అభినందనీయమని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసించారు. గురువారం గాంధీ నగర్ లో మా ఆర్ట్స్ నిర్వాహకులు చింతల రామారావు (బాబి), చంటి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో ఆకుల శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా బాబి, చంటి బ్రదర్స్ దసరా ఉత్సవాలను అత్యంత భక్తి ప్రపత్తులతో కన్నుల పండుగగా నిర్వహిస్తుండటం ఆదర్శప్రాయమని అన్నారు. దసరా సందర్భంగా అక్టోబర్ 4వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు మా ఆర్ట్స్ కార్యాలయం వద్ద నుండి జరిగే అమ్మవారి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొలనుకొండ శివాజీ, యర్రంశెట్టి అంజిబాబు, దూబ తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ 109వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన

**జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ అధ్యక్షులు కళికోట కమలాకర్, రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత,**



**జవహర్ నగర్, సెప్టెంబర్ 25:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ బిజెపి పార్టీ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలవేసి నమస్సుమాంజులు అర్పించడం జరిగింది. సమాజంలో అసమానతలు రూపుమాపడానికి అంత్యోదయ అనే ఆయుధాన్ని ప్రవచించిన నవభారత రూపశిల్పి, సాధారణ జీవితం గొప్పగా ఆలోచించడం అనే దానికి ప్రత్యక్షంగా జీవించిన మానవతా మూర్తి పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ.. జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరిగా భారతీయ జనతా పార్టీ మూల సిద్ధాంతాన్ని "ఏకత్మతా మానవత వాదం" ప్రవచించిన వ్యక్తిగా ప్రపంచానికి తెలిసిన వ్యక్తి, ఆ మహనీయుని జయంతి సందర్భంగా స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ పశ్చిమ శాఖ బిజెపి అధ్యక్షులు కమల్ మరియు రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్ నేత, రాష్ట్ర బిజెవైఎం కార్యదర్శి ఉడుత సంతోష్ గుప్తా, జిల్లా బిజెపి కార్యదర్శి కుర్ర పుణ్యరాజు, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లిఖిత యాదవ్, బిజెపి మాజీ ఉపాధ్యక్షులు నరేష్ యాదవ్, బీజేవైఎం మాజీ అధ్యక్షులు రామ్ నాయక్, స్థానిక బిజెపి ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, ముచ్చర్ల యాదగిరి, కార్యదర్శి ఓరుగంటి లత, గిరిజన మోర్చా అధ్యక్షులు రాజు నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షులు రవి ముదిరాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నసమారాధన





**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :**శేరిలింగంపల్లి నియోజ కవర్గం, లింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని 4వరోజు మరబోయిన అనిల్ కుమార్ యాదవ్,రవి కుమార్ యాదవ్ తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,మహిళలు,పిల్లలు,భక్తులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గుండెపోటుతో పాత్రికేయుడు సురేష్ మృతి



**మల్కాజిగిరి సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి):** సీనియర్ పాత్రికేయుడు మండే సురేష్ గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. గత 20 ఏళ్ళుగా పత్రికా రంగంలో మల్కాజిగిరి ప్రాంత విలేఖరిగా పని చేస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం కాలు విరిగి కొలుకుంటున్న క్రమంలో గురువారం సాయంత్రం గుండెపోటు రావడంతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ నాయకులు సంతాపం, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

## శ్రీ కాత్యాయని దేవిగా కొలుదీరిన అమ్మవారు...



**విజయవాడ, సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ దుర్గామాత తొమ్మిది రూపాలలో ఆరవది కాత్యాయనీ దేవి. పురాణాల ప్రకారం ఈ అవతారం మహర్షి కాత్యాయనుడు చేసిన దీర్ఘ తపస్సు ఫలితంగా అమ్మవారు ప్రత్యక్షమైంది. అశుభశక్తుల వినాశనం, సత్యధర్మాల స్థాపన కోసం శక్తి స్వరూపిణి కాత్యాయనీ దేవి గా అవతరించింది. విజయవాడ నగరం పోరంకి నారాయణ పురం కాలనీ లోని శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం లో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం నాడు శ్రీ పద్మావతి అమ్మవారిని శ్రీ కాత్యాయని దేవి గా అలంకరణలో కొలుదీరారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిపారు. "కాత్యాయనీ దేవి శక్తి అవతారం మాత్రమే కాదు, స్త్రీ శౌర్యానికి ప్రతీక. భక్తిలో అచంచల విశ్వాసం ఉంచిన వారికి ఆమె సర్వ రక్షణ ప్రసాదిస్తుంది" అని ఆలయ అర్చకులు తెలిపారు."కాత్యాయనీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని విరిగా భక్తులు సందర్శించి తీర్థప్రసాదాలు స్వికరించారు. కాగా 26 వ తేదీ శుక్రవారం నాడు అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీ దేవి గా అలకరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియచేశారు. కావున భక్తులు సందర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కమిటీ సభ్యులు కోరారు...

## శ్రీ కొండలమ్మ సన్నిధిలో భక్తి తన్మయత్వం...





**గుడ్లవల్లేరు:సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన సన్నిధి గురువారం దసరా నవరాత్రుల్ని పురస్కరించుకుని భక్తజనంలో భక్తి తన్మయత్వం ప్రజ్వరిల్లింది. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, దేవస్థాన సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, ఎక్స్%-% అఫీషియో మెంబర్ శ్రీ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ సామూహిక కుంకుమ పూజ, హెూమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి సహస్రనామార్చన, శీఘ్ర వివాహమునకు కుజదోష పరిహారమునకు, శ్రీ అమ్మవారి మూల మంత్ర హవనములు జరిగినవి. ఉదయం రకముల ఫలరసాలతో పంచామతములతో, సుగంధ ద్రవ్యాలతో శ్రీ అమ్మవారికి అభిషేకము జరుగును. అనంతరం లక్ష కుంకుమార్చన పూజ జరిగింది. అలాగే దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారికి ఊంజల సేవను నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## శిల్పారామంలో ఘనంగా నవరాత్రి, బతుకమ్మ, దసరా,దీపావళి సెలబ్రేషన్స్





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామం లో నవరాత్రి,బతుకమ్మ,దసరా సెలెబ్రేషన్స్ అండ్ సారీస్ అఫ్ ఇండియా మేళ ను నిర్వహిస్తున్నారు. డెవలప్మెంట్ అఫ్ కమీషనర్ హ్యాండ్లూమ్స్,గవర్నమెంట్ అఫ్ ఇండియా మరియువీవెర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో దాదాపుగా వంద చేనేత స్టాల్స్ ఏర్పాటుచేయడం జరిగాయి. బనారస ్,చెందేరి, కోట,గుజరాతీ ,ఉప్పాడ,బనారస్,కాశ్మీరీ,మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా "నవదుర్గామృతం" భరతనాట్య నృత్య ప్రదర్శన గురువు గౌతమీ రవిచంద్ర శిష్య బృందం ఎంతగానో అలరించింది. నవదుర్గలుగా గాయత్రీ,నవ్య,మౌనిక, జోషునికా,నిఖిల ,శ్రీనిధి,సుభిక్ష, మీనాక్షి,జెస్సిదేవి లు నర్తకీమణులుగా సానియా,ఇందిరా ,వసంత,దీక్ష,రష్మిక,వర్ష ,జయశ్రీ,షణ్ముఖి, తన్వి,విహ, కౌశిక,ప్రవల్లిక, కాత్యాయని,దేవాంశ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# మౌలిక వసతుల కల్పనతో కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం - ఎమ్మెల్యే



**నిజాంపేట్, సెప్టెంబర్ 25, (వార్తాప్రభ) :** నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై గురువారం బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి .వివేకానంద్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీరా నీటి నిర్వహణ, బిల్లులు, వీధి దీపాల నిర్వహణ, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, చెరువుల అభివృద్ధి, వర్షపు నీటి కాలనీలలో నిలిచిపోవడం, నత్త నడకన సాగుతున్న బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత పదకొండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లు, కాలనీలలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంజీరా నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు చెరువుల పునరుద్దరణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాక మౌలిక వసతుల కల్పనలో భాగంగా టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

**ప్రజా ఆరోగ్యంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు...**నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతి నగర్, నిజాంపేట్ ప్రాంతాలలోని అన్నీ కాలనీలలో శానిటేషన్ నిర్వహణ సరిగాలేదని, శానిటేషన్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్నీ డివిజన్లలో పెరుగుతున్న దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్ ను విధిగా నిర్వహించాలని.

**చెరువులు, పార్కుల సుందరీకరణ....**చెరువుల సుందరీకరణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది చెరువులకు 22 కోట్లు, ఐదు పార్కుల అభివృద్ధికి 10 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందని ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని అన్నారు.

**స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు...**నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరచాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఎమ్మార్వో పూల్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పని వేళల పెంపు ఆలోచనను విరమించుకోవాలి

**- శ్రామిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆర్.రఘు డిమాండ్**




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం 13 గంటల పనిదినం ఆలోచనను వెంటనే విరమించుకోవాలని శ్రామిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆర్.రఘు డిమాండ్ చేశారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ శ్రామిక హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో కొండపల్లి బ్యాంకు సెంటర్ లో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ తాజాగా కూటమి ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని రద్దుచేసి, దాని స్థానంలో 13 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మహిళలను రాత్రి వేళల్లో పని చేయించే హక్కు పరిశ్రమ అధిపతులకు ఇస్తూ ఫ్యాక్టరీ చట్టాన్ని మార్పు చేయడం గర్హనీయమన్నారు. ఇది పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకే కాకుండా మొత్తం కార్మిక వర్గంపై పెట్టుబడిదారులకు, పరిశ్రమ అధిపతులకు శాశ్వతంగా అజమాయిషీ చలాయించే హక్కు కలుగజేసినట్లు అవుతుందన్నారు. పనిచేసే కార్మికులకే కాకుండా వారి కుటుంబంపై, వ్యక్తిగత సాంఘిక జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా 22 అఖిల భారత సమ్మెలు జరిపామన్న సంతృప్తిని విడనాడి పెట్టుబడిదారులు తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విసురుతున్న ఈ సవాల్ కు దీటైన సమాధానం చెప్పాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలను వెనక్కి తీసుకోకుంటే కార్మిక వర్గం పోరాటాలకు ఐక్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శోభాయమానంగా విజయ నర్తనం

**చూపరులను విశేషంగా ఆకట్టుకున్న 300 మంది ఒకే చోట నృత్య ప్రదర్శన**

**పవిత్రసంగమం వద్ద దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**చారిత్రక ప్రాధాన్యత కలిగిన కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'విజయనర్తనం' పేరుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణంలో విజయదశమి ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. కృష్ణ గోదావరి నదుల అనుసంధానం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద 'విజయనర్తనం' ఉత్సవాల్లో భాగంగా 300 మంది కళాకారులతో ప్రత్యేక నృత్యప్రదర్శనను గురువారం రాత్రి నిర్వహించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను ఇక్కడ నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పవిత్ర సంగమంకు పూర్వ వైభవం తెచ్చేదిశగా కృషి చేసినట్లు వెల్లడించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తి గీతాలకు నృత్యం చేసి అలంరించిన మహా బృందం కళాకారులను, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ సీటు సాధించిన పేదింటి బిడ్డ



**నెల్లికుదురు సెప్టెంబర్ 25(వార్తా ప్రభ)** నెల్లికుదురు మండలం , బంజర మారుమూల గ్రామానికి చెందిన పేదింటి బిడ్డ, వ్యవసాయ కూలీలు అయినా గుండెపాక రామ అశోక్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు రెండవ కుమార్తె గుండెపాక స్రవంతి ఎంబీబీఎస్ సీటు( మెడికల్ ) సాధించింది. కరీంనగర్ ప్రతిమ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో సీటు లభించింది. స్రవంతి 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు సోషల్ వెల్ఫేర్ నర్సింహులపేట ఇంటర్మీడియట్ సోషల్ వెల్ఫేర్ ధన్వాయిగూడెం ఖమ్మం సిఓఈ కళాశాలలో విద్యను అభ్యసించింది. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ గౌల్ దొడ్డి హైదరాబాదులో కోచింగ్ తీసుకుంది. పేదరికాన్ని జయించి పట్టుదలతో చదివి మెడికల్ సీటు సాధించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ఆమె చదువు ముందుకు సాగుతుందని వేడుకుంటూ ఇతర విద్యార్థులు స్రవంతిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో స్థిరపడాలని కోరుతున్నారు.

## వడ్డీ లక్ష్మీ నరసమ్మకు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే డి.ఎన్.ఆర్



**కలిదిండి సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ)**కలిదిండి మండలం,ఆవకూరు గ్రామంలో మాజీ సర్పంచ్ వడ్డీ సీతారామయ్య సతీమణి లక్ష్మీ నరసమ్మ మృతి పట్ల, కైకలూరు మాజీ ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు వారి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కలిదిండి మండలం ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ ఇవాక కార్యదర్శి ఎండి గాలిబ్, కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాంబాబు,వైయస్సార్సిపి రాష్ట్ర, మండల స్థాయి నాయకులు, పాల్గొని కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 25, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ లో మొగుళ్ళ కుంట చెరువు, ఊర చెరువు నుండి పాక్ సాగర్ కి నాళా లేకపోవడం వల్ల వర్షానికి అక్కడున్న పరిసరప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్రయిబ్బందులు పడుతున్నారని గురువారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేస్తూ అపర్ణ పార్క్, గణనంద, ఆదిత్య పార్క్, నూజివీడు సీడ్స్, పరిసర ప్రాంతాల సమస్యను అతిత్వరగా పరిష్కరించాలని, అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో నెలకొన్న పలు సమస్యలను కూడ పరిష్కరించాలని కోరారు. వెంటనే కలెక్టర్ స్పందించి.. సంబంధిత అధికారులకు ఆదేశాలు జరిచేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా చేయూత

**మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్**


**కొండపల్లిలో నేహ ఫ్యాషన్స్ మరియు బోటిక్ ప్రారంభించిన శ్రీనాథ్**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా చేయూత ఇస్తుందని తెలిపారు మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్. కొండపల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన నేహ ఫ్యాషన్స్ మరియు బోటిక్ షోరూం ను కొండపల్లి మున్సిపాలిటీ ఇంచార్జ్ కమిషనర్ మోస్మి గనియ తో కలిసి ప్రారంభించారు కృష్ణ ప్రసాద్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా నేహను ఆదర్శంగా తీసుకొని సొంత కాళ్లపై నిలబడాలని తెలిపారు. అందుకు మెప్మా తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్ వాసు, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎండి అప్సర్, చెరుకుమల్లి సురేష్, సిటీ మిషన్ మేనేజర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపాలి

**- సబ్ కలెక్టర్ చైతన్య**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని కృష్ణా నది తీర ప్రాంతాలను విజయవాడ సబ్ కలెక్టర్ కె.చైతన్య గురువారం పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కృష్ణా నదిలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పవిత్ర సంగమం, ఫెర్రీ, జూపూడి చిన లంకలో వరద ఉధృతిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కృష్ణా నదికి వరద పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ తీర ప్రాంత ప్రజలు, లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఇన్ చార్జి కమిషనర్ మోష్మీ గనియా తదితరులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యూఎస్ కి అర్హత లేని కానిస్టేబుల్ ఉపాధ్యాయురాలు గా ఎంపిక.

**ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పై పూర్తి విచారణ చేయాలి.**



**మచిలీపట్నం సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16347 ఉపాధ్యాయుల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు అనేకమంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి మెరిట్ లిస్ట్ ప్రకటించారు. ఈ మెరిట్ లిస్టులో అర్హత సాధించిన వారినీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా లోని ఉపాధ్యాయుల పోస్టులకు అర్హత సాధించిన వారిలో రోస్టర్ పాయింట్ ,రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలు సాధించిన వారి లిస్ట్ ను విడుదల చేశారు. దీనిలో కృష్ణాజిల్లా కోడూరు గ్రామంకు చెందిన ముప్పిరీశెట్టి అనూష అనే కానిస్టేబుల్ ఎస్జిటి ఉపాధ్యాయ పోస్టుకు ఈడబ్ల్యూఎస్ కోటాలో ఉద్యోగానికి ఎంపిక అయింది. అయితే ఆమె ఈడబ్ల్యూఎస్ కోటా కు అనర్హురాలుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి ప్రధానమైన కారణం అనూష కు గుంటూరు జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ తో వివాహం జరిగింది. అయితే ఈడబ్ల్యూఎస్ (ఎకనామికలి వీకర్ సెక్షన్ )కోట వర్తించాలి అంటే కుటుంబ ఆదాయం 8 లక్షలకు మించి ఉండకూడదని నియమం ఉంది. 8 లక్షల కంటే ఆదాయం ఉన్నవారికి ఈడబ్ల్యూఎస్ కోట వర్తించదు. ముప్పిడి శెట్టి అనూష దంపతులు ఇద్దరు పోలీసు కానిస్టేబుల్ లు అవ్వటం వలన వారి కుటుంబ ఆదాయం ఎనిమిది లక్షలకు మించి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అనూష , ఆమె భర్త కానిస్టేబుల్ లు అవ్వటం వల్ల ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తహసిల్దార్ ఇవ్వలేదని ఆమె కోడూరు కు చెందిన తాసిల్దార్ కు తల్లిదండ్రులతో కలిసి ఉన్నట్టుగా సృష్టించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అప్లై చేసుకుంది. సర్టిఫికెట్ కోసం ఎమ్మార్వో కు రాజకీయ నాయకులతో సిఫారసు చేయించడంతో రాజకీయ నాయకుల ఒత్తిడితో కోడూరు ఎమ్మార్వో ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ మంజూరు చేశారు. అనూష 2025 మెగా డీఎస్సీలో ఈ డబ్ల్యూ ఎస్ అర్హత లేకుండా ఈడబ్ల్యూఎస్ కోటాలో ఉపాధ్యాయురాలు గా ఉద్యోగం సాధించింది. అనూష అర్హత లేకపోయిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తో ఉద్యోగం సాధించిందని స్థానికులు తీవ్ర ఆరోపణ చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ, రెవిన్యూ శాఖ జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కు అర్హత ఉందో లేదో పూర్తి విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## సిఆర్. రెడ్డిఫార్మాస్యూటికల్‌సైన్సెస్ కళాశాల లో హెచ్‌ఐవీ మరియు టీబీ పైఅవగాహనసదస్సు




**ఏలూరు సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)** హెచ్‌ఐవీ మరియు ట్యూబర్క్యులోసిస్(టీబీ) పైఅవగాహనసదస్సు సి.ఆర్.రెడ్డిఫార్మాస్యూటికల్‌సైన్సెస్ కళాశాలలో ఘనంగానిర్వహించబడింది .ఈకార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ, ఇలూరు ప్రాజెక్ట్ మేనేజర్ కీర్తిశిరీష తనబృందంతో కలిసినిర్వహించారు.ఈఅవగాహనకార్యక్రమాన్ని మహిళాసాధికారత మరియు ఫిర్యాదులసెల్,అలాగే ఎన్ఎస్ఎస్యూనిట్స్ సంయుక్తంగాఏర్పాటుచేసింది. విద్యార్థుల్లోహెచ్‌ఐవీ మరియు టీబీవ్యాధుల నివారణ, నిర్ధారణమరియు చికిత్సపట్లఅవగాహన కల్పించడం ఈ కార్యక్రమప్రధాన ఉద్దేశ్యం. ఈసందర్భంగా కీర్తిశిరీషమాట్లాడుతూ,"హెచ్‌ఐవీ తో జీవిస్తున్నవ్యక్తుల్లో టిబిభారాన్ని తగ్గించేందుకు, అలాగే టిబితోబాధపడుతున్న వారిలోహెచ్‌ఐవీ ప్రభావాన్ని తగ్గించేందుకు డబ్ల్యుహె చ్‌వో సిఫార్సులను అమలుచేయడం అత్యంత అవసరం.టిబిమరియుహెచ్‌ఐవీ నివారణ, స్క్రీనింగ్, నిర్ధారణ, చికిత్స మరియుసంరక్షణకు సంబంధించి సమగ్రమార్గదర్శకాలు అందుబాటులోఉన్నాయి. వీటిఅమలుతో సమయానికి గుర్తింపు, సమర్థవంతమైన చికిత్స సాధ్యమవుతుంది .అంతేకాక, సామాజిక ముద్రను తొలగించేందుకు విద్యార్థులు ముందుండాలి"అనిపేర్కొన్నారు. విద్యార్థులు ఈకార్యక్రమంలో చురుకుగాపాల్గొని,అనేకప్రశ్నలు అడిగి తమసందేహాలను నివృత్తిచేసుకున్నారు .కార్యక్రమం చివర్లో డీఎంహెచ్‌ఓ బృందం విద్యార్థులకు సమాచార పత్రాలు పంపిణీచేసింది. ఈకార్యక్రమం విద్యార్థుల్లోఆరోగ్యపట్లఅవగాహనపెంపొందించడంలోకీలకంగానిలిచింది.ఈసందర్భంగాకార్యక్రమాన్నివిజయవంతంగానిర్వహించడంలోసహకారంఅందించినమాకళాశాలయాజమాన్యం,ప్రిన్సిపాల్మరియుసిబ్బందికి హృదయ పూర్వకకృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. వారిసమన్వయం మరియు మద్దతువల్లే ఈఅవగాహనకార్యక్రమంసఫలమైంది.

## మెగా డీఎస్సీ ఉపాధ్యాయులకు ఎంపికైన వారితో కలెక్టర్ సమావేశం.





**మచిలీపట్నం సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉపాధ్యాయ వృత్తి సమాజంలో కీలకపాత్ర పోషించే ఎంతో గొప్ప వృత్తి అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన 1250 మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పామర్రు లోని ప్రగతి విద్యాసంస్థల లో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని తన ప్రసంగంతో ప్రేరణ కలిగించి స్ఫూర్తిని నింపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయుల వల్లనే సాధ్యమవుతుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిని గౌరవంగా భావించి ప్రేమించాలని వారికి ఇచ్చిన సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమాజానికి భారం కాకుండా వారికి సజావుగా బోధించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.మనసు దృష్టి పెడితే ఎంతటి అసాధ్యమైన పనైనా సాధించవచ్చు అని ఉద్బోధించారు. ఇందుకు నిదర్శనం భారత పూర్వ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్రను సోదాహరణంగా కలెక్టర్ వివరించారువారు విద్యార్థులకు బోధిస్తూనే తుది శ్వాస విడిచారని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉపాధ్యాయ వృత్తిని బాధ్యతతో నిర్వహించాలన్నారు.నిరంతర విద్యార్థిగా ఉంటూ తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో పివిజే రామారావు, కార్యక్రమ ప్రత్యేక అధికారి జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, విద్యాసంస్థల అధినేతబిపూర్ణచంద్రరావు, ఎంఈఓ లు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వ దుశ్చర్యలను అసెంబ్లీలో ఎండగట్టిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని.

- గత ప్రభుత్వ పాలన హిట్లర్ పాలన కన్నా దారుణం.
- తప్పు అని చెబితే దాడులు, కేసులు, జైలు శిక్షలు.



**కైకలూరు సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ)** రాష్ట్ర అసెంబ్లీలో ఈరోజు జరిగిన చర్చలో కైకలూరు శాసనసభ్యుడు డా. కామినేని శ్రీనివాస్ గత ప్రభుత్వం చేసిన విధ్వంసాలను తీవ్రంగా ఎండగట్టారు. గడచిన ఐదేళ్ల పాలనలో ప్రజలపై, రాజకీయ నాయకులపై, అధికారులపై దాడులు జరిపి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు.సొంత పార్టీ ఎంపీపై కూడా దాడులు జరిపించడం, మాజీ మంత్రులపై దాడులు చేయించడం, నిరపరాధులపై తప్పుడు కేసులు మోపడం, అమరావతి రైతులపై దారుణ హింసకు పాల్పడడం,ఇవన్నీ ఆ పాలనలో సాధారణమైపోయాయి. ఆడబిడ్డలు అని కూడా చూడకుండా అమరావతి రైతుల కుటుంబాలను రోడ్డుపై కొట్టడం హిట్లర్ పాలనకన్నా దారుణం" అని వ్యాఖ్యానించారు.తప్పును తప్పు అని ఎవరైనా చెప్పగానే వారిపై కేసులు పెట్టడం, జైలులో పెట్టి కొట్టించడం గత ప్రభుత్వంలో నిత్యకృత్యమైందని కామినేని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ ఆఫీసులపై దాడులు చేయించడం, మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై రౌడీలను తీసుకువెళ్లి గొడవ చేయించడం వంటి చర్యలకు పాల్పడి, ఆ గొడవ చేసిన వారికే మంత్రి పదవులు ఇవ్వడం ఆ పాలనలో ప్రజాస్వామ్యానికి జరిగిన ఘోర అవమానం అని అన్నారుపదవుల కోసం అంతర్గత గొడవలుపదవుల కోసం ఆ పార్టీ నాయకులు ఒకరితో ఒకరు చేసుకున్న గొడవలు మునుపెన్నడూ చూడలేదని కామినేని విమర్శించారు. అధికారం కోసం పోరాటం, స్వార్థం కోసం హింసే ఆ పార్టీకి మారుపేరు అయిందని అన్నారు.రాష్ట్రాన్ని నాశనం చేసిన గత పాలనను ప్రజలు మరిచిపోరని, భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినవారికి ప్రజాస్వామ్యంలో తగిన శిక్ష తప్పదని కామినేని హెచ్చరించారు.

## సహకార భారతి సమ్మేళనమునకు మంత్రి కొండపల్లికి ఆహ్వానం



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 25 : (వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో అక్టోబర్ 26వ తేదీన జరగబోవు సహకార భారతి రాష్ట్ర సమ్మేళనంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యమ్ యస్ యమ్ ఈ,సెర్ప్ , యన్ ఆర్ ఐ సంబంధాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాసరావు ని సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు అడ్డూరి శ్రీనివాసరావు ఆహ్వానించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రం కలిసిన సహకార భారతి నాయకులు మంత్రికి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి శ్రీనివాసరావు తో పాటుగా జాతీయ కార్యవర్గ సభ్యురాలు జానకీదేవి , ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తలు మమ్ముల తిరుపతిరావు,అమరా సర్వదేవుళ్ల తదితరులు పాల్గొన్నారు.

## 4 వ రోజుకు కాంట్రాక్టు కార్మికుల రిలే దీక్షలు

**కార్మికులకు సంఘీభావం తెలిపిన జంపాల సీతారామయ్య**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం (కె - 215) కార్యాచరణలో భాగంగా ఎన్టీటీపీఎస్ అకౌంట్స్ ఆఫీస్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 4వ రోజుకు చేరాయి. కార్మికుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం సమయంలో కాంట్రాక్ట్ కార్మికుల కోసం పలు నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కాంటాక్ట్ కార్మికులను నిర్లక్ష్యం చేశాయని, మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడంతో కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తప్పకుండా కార్మిక సమస్యలను స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాముల నాగేశ్వరరావు,పర్వతనేని సాంబశివరావు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం స్వతంత్ర కుమార్,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉండాలోయ్! బ్రతుకులో




పదిమందికి బాటలా
పేదోళ్లకు కోటలా
జీవజలపు ఊటలా
ఉండాలోయ్! బ్రతుకులో
మమకారపు మూటలా
గుబాళించు తోటలా
స్ఫూర్తినిచ్చు ఆటలా
ఉండాలోయ్! బ్రతుకులో
ఉపకరించు నోటిలా
పుడమిలోని మొక్కలా
వెలుగులీను చుక్కలా
ఉండాలోయ్! బ్రతుకులో
విహరించే పక్కిలా

మధురమైన మాటలా
మనసు దోచు పాటలా
ఉండాలోయ్! బ్రతుకులో

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

## దీనదయాళ్ ఆశయ సాధనకు కృషి చేయాలి





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి సుధీష్ణ అన్నారు. కొండపల్లి పట్టణ పరిధిలోని 171, 174, 177, 178, 184, 218, 219, 222 బూత్ ల్లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జీ 109వ జయంతి కార్యక్రమాలను 'ఆత్మ నిర్భర్ భారత్ – పండిట్ దీనదయాళ్ ఆలోచనలు'తో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ సమాజంలో చిట్టచివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు అందాలని దీనదయాళ్ ఆకాంక్షించారన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి మారాసు కృష్ణమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా ఆంజనేయులు, మున్సిపాలిటీ ఉపాధ్యక్షురాలు పచ్చిగోళ్ళ కీర్తి, కార్యదర్శి నక్కా రమేష్, కరుకుమల్లి సత్యవతి, కృష్ణంరాజు, కొండపల్లి మున్సిపాలిటీ సేవా పక్వాడ్ సభ్యులు దాము భవానీ, సేనాపతి నాగమణి, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కూనాల యుగంధర్, వెల్లం కృష్ణ కుమారి, బొర్రా ప్రవీణ్, ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు భూక్యా తిరుపతమ్మ, రాష్ట్ర సంక్షం ఉపాధ్యక్షులు ఎ.వి.ఎస్.మూర్తి, ఎస్.సూరజ్, బుల్లిపాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణదాతలు ఫార్మసిస్టులు

**- కరోనా నుండి ప్రపంచాన్ని కాపాడారు**
**- ఫార్మసీ డే వేడుకల్లో కెయూ ఉపకులపతి**




**మచిలీపట్నం సెప్టెంబర్ 25::(వార్తా ప్రభ ప్రతినిధి)**నేటి ప్రపంచంలో వెలుగు చూస్తున్న భయంకరమైన వైరస్ ల బారి నుండి ప్రజల ప్రాణాలు కాపాడబడుతున్నాయంటే మూలకారకులు ఫార్మాసిస్టులు అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ కొనియాడారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసీ దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫార్మసిస్టులు రూపొందించిన ఫార్ములా లే ఫార్మా కంపెనీలు మందులుగా తయారు చేసి తమ కంపెనీ పేరు మీద విక్రయాలు చేస్తాయని గుర్తుచేశారు. భారతదేశంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న రంగం ఫార్మా రంగం అని, మూడు లక్షల రూపాయల నుండి మూడు కోట్ల రూపాయలు వరకు జీతం గా పొందటానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డా ఎస్ ఎల్ ఎన్ ప్రసాదరెడ్డి ప్రధానోపాన్యాసం చేస్తూ ఫార్మా రంగం లో దేశీయంగా చోటుచేసుకుంటున్న మార్పులు పై సోదాహరణంగా వివరించారు.తొలుత ఫార్మసీ పితామహుడు గా పేరొందిన స్కాఫ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఫార్మసీ కళాశాల అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటమునిగిన వరాహపట్నం–సీతనపల్లి రహదారి.

## డ్రైనేజీలు పై ఆక్రమణలు తొలగించాలి అంటున్న స్థానికులు.



**కైకలూరు సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ)** కైకలూరు పరిధిలోని వరాహపట్నం–సీతనపల్లి రహదారి పూర్తిగా నీటమునిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, డ్రైనేజీ పూడికలు సమయానికి తొలగించకపోవడమే సమస్యకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. పూడికలు తొలగిస్తే నీరు సాఫీగా బయటకు వెళ్లి రహదారి మీద నిల్వ ఉండదని తెలిపారు.రోడ్డు పక్కన ఉన్న అనధికార ఆక్రమణలు కూడా నీటి పారుదల మార్గాలను మూసివేయడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని స్థానికులు సూచించారు.
ప్రజలు అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పూడికలు, ఆక్రమణలు తొలగించి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎపి జెన్ కో నూతన యం. డి కు యూనియన్ నేతల శుభాకాంక్షలు

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**ఎపి జెన్ కో మేనేజింగ్ డైరెక్టర్ గా నూతనముగా భాద్యతలు చేపట్టిన శ్రీమతి యస్.నాగ లక్ష్మి ను ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-129) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి ,అధ్యక్షుడు యం .మోహన్ రావు లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంకితభావం కలిగిన అధికారిగా పేరున్న నాగ లక్ష్మి నేతృత్వములో ఎపి జెన్ కో మరింత అభివృద్ధి సాదిస్తుందని, అదేవిధంగా ఉద్యోగుల,కార్మికుల సమస్యలు కూడా త్వరగా పరిస్కహారము అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు,రవి, సుబ్బారావు వలి పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో కెనటిక్ లూనా ప్రైమ్ ప్రారంభం



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో ప్రఖ్యాతి గాంచిన కెనటిక్ సంస్థ మార్కెట్లోకి మరో నూతన లూనా ప్రైమ్ ను గురువారం విడుదల చేసింది.లూనా ప్రైమ్ ను ఇబ్రహీంపట్నం విజయదుర్గ మోటార్స్ లో ఆవిష్కరించి, మొదటి వాహనాన్ని కొనుగోలు చేసిన వినియోగదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ లూనా ప్రైమ్ ద్వారా పూర్తిగా కాలుష్యం నియంత్రణతో పాటు, రవాణా సులభతరం అవుతుందని అన్నారు. అంతేకాకుండా వినియోగదారుని అవసరాలకు తగ్గట్టుగా తక్కువ బడ్జెట్ లో ఎక్కువ ఉపయోగాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయదుర్గ మోటార్స్ అధినేత రాంబాబు,కెనటిక్ మోటార్స్ ప్రతినిధులు అరవింద్ కుమార్,ప్రకాష్ పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు






**గుడివాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** పట్టణం నందు శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఎంతో కన్నుల పండుగగా జరుగుతున్నాయి. స్థానిక పాటిమీద జగన్నాధపురం లో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక శ్రీ రాజ్యలక్ష్మి శరన్నవరాత్రి మహోత్సవములలో భాగ ముగా గురువారం శ్రీ విజయలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ అమ్మ వారు భక్తులు ప్రతి పనిలో విజయం పొంది విధముగా కరుణాకటాక్షములు కలగజేయాలని కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలియజేసినారు. అలాగే ఆలయ అర్చక స్వామి మాట్లాడుతూ అవకాశము గుడివాడ పట్టణ యవ్వన్మంది భక్తులు వినియోగించు కొని అమ్మ వారి కృప పొందాలని కోరియున్నారు.

**శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో.. :** గుడివాడలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డు లోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి వేద పం డితులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఉత్సవాల ఐదో రోజు శుక్రవారం శ్రీ గజలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని దేవస్థానం ఈఓ కందుల గోపాలరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు పట్టపు చిన్నా తెలియజేశారు. 26వ తేదీ శుక్రవారం దేవస్థాన ప్రాంగణంలో శ్రీ చండీ హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు గోపాలరావు తెలియచేశారు.

**శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానములో.. :** గుడివాడ గౌరీశంకరపురం లో వేంచేసి ఉన్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానములో నిర్వహి స్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములులో భాగంగా నాలుగవ రోజు అమ్మవారు శ్రీ కాత్యాయిని దేవి అలంకారంలో అలాగే స్వామి వారు ఐశ్వర్య ఈశ్వర స్వామి వార్లగా భక్తులకు దర్శనమిచ్చారు. పై కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ నెరుసు సుభాష్ చంద్ర బోస్, కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ట్రస్టీలు ఏ మల్లి, పి శ్రీను, ఎన్ భవాని, వై జయలక్ష్మి, పి శ్రీకుసుమ, బి వరలక్ష్మి, కె. నాగేశ్వరరావు మరియు ఎక్స్ ఆఫీషియో ఎల్ గిరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో.. :** నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో శ్రీ గాయత్రీ దేవి దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి వేద పండితులు పునీత్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవా రిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల ఐదో రోజు శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు హరిబాబు, ఈవో గంగు శిరీష తెలియజేశారు. ఉత్సవ వేడుకలను దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు డి మహాలక్ష్మి, కే ప్రభు, ఎం రాముడు, బి శ్రీదేవి, ఏ విజయ కుమారి, బి జయలక్ష్మి పర్యవేక్షించారు.

**శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో.. :** పాత గుడివాడ లోని కాకర్ల వీధిలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవములు భాగంగా ఉద యం 4వ రోజు శ్రీ గజలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు విశేష అలంకా రము, పూజలు నిర్వహించారు. పై కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంగదాల సతీష్, కార్యనిర్వహణాధికారి కె.వి. గోపాలరావు మరియు ట్రస్టీలు కె శ్రీనివాస్, డి చంద్రశేఖర్, కె.ఆంజనే యులు, యమ్ సీతారామయ్య, పి శాంతి, యమ్ దుర్గా పద్మజ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీశ్రీశ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో.. :** స్థానిక 8వ వార్డు లోని పెద్దవీధి లో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వడ్డపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈరోజు 4వ రోజు అమ్మవారిని శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంగా ప్రజలకు భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఈ పూజాది కార్యక్రమాల్లో అమ్మవారికి దానాల ఫణి భవాని దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్వాహరాలు ధనాల సత్తమ్మ, దానాల వెంకట రత్నారావు లక్ష్మి, డాక్టర్ శ్రీను మరియు వార్డు ప్రముఖులు, భక్తులు అందరు పాల్గొని అమ్మవారి కరుణాకటాక్ష కృపకు పాత్రులయ్యారు.

## వాసవీ క్లబ్ పూర్వపు అధ్యక్షులకు చిరు సత్కారం



**గుడివాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన వాసవి క్లబ్ వనిత విధార్భపురి గుడివాడ వారు నిర్వహించిన గవర్నర్ అధికారిక పర్యటన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలైన చలువది లక్ష్మీ సురేఖ పూర్వపు అధ్యక్షులైన తాతా రజిని కుమారి శేగు బబిత తాత పద్మలత రవ్వా గిరిజాదేవీ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాత రజనీకుమారి మాట్లాడుతూ ఈ రోజు జరిగిన గవర్నర్ గారి అధికారికి పర్యటన కార్యక్రమాన్ని ఎంతో చక్కగా నిర్వహించినందుకు అభినందనలు తెలియజేశారు. శేగు బబిత మాట్లాడుతూ అధ్యక్షురాలు లక్ష్మి సురేఖ ఈ సంవత్సరం వనిత క్లబ్ ద్వారా అద్భుతమైన సేవలు అందించినందుకు ప్రశంసించారు. పూర్వపు అధ్యక్షులైన తమని సత్కరించినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు చలువది లక్ష్మీ సురేఖ కార్యదర్శి బోండా నాగవల్లి కోశాధికారి గోకవరపు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసిన డాక్టర్ వేణు బాబు



**తిరువూరు,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం గానుగపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్,మాజీ మంత్రి వర్యులు కె.ఎస్ జవహర్ గారు నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పెన్సిల్ స్కెచ్ ఫోటో భుకరణ చేసిన రోలుపడి గ్రామ పంచాయతీ రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మేకల వేణుబాబు,యువ నాయకులు మోదుగు వంశీ,తదితరులు పాల్గొన్నారు....

## క్షేత్ర స్థాయి విజ్ఞాన సముపార్జనకే పారిశ్రామిక సందర్శన



**గుడివాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** పరిశ్రమలను సందర్శించడం వలన ఎం.బి.ఎ. విద్యార్ధులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుందని ఎ.ఎన్.ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ అన్నారు. విద్యార్ధులు ఏలూరుజిల్లా సింగరాయపాలెం గ్రామంలోని గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో ప్రత్యక్ష జ్ఞానం సంపాదించడం వలన విద్యార్ధులు వృత్తి నైపుణ్యాలు పెంపోదించు కుంటారన్నారు. గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ హెచ్.ఆర్.మేనేజర్ చౌదరి మరియు డిప్యూటీ హెచ్.ఆర్.మేనేజర్ పి.శ్రీకీర్త్ లు మాట్లాడుతూ చేపలు మరియు రొయ్యలు మేతలు వాటితోపాటు పెంపుడు జంతువుల మేతలు కుడా తయారుచేసే విధానాన్ని గురించి విద్యార్ధులకు క్లుప్తంగా వివరించారు. గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ లో మేతలు తయారు చేయడం వాటి యొక్క ఎగుమతులు ముఖ్యంగా సౌది అరేబియా దేశానికీ ఎక్కువగా ఎగుమతి చేస్తున్నామని తెలియజేసారు. అలాగే ముడి పదార్ధాలను జపాన్ నుండి దిగుమతి చేసుకుంటున్నామని క్లుప్తముగా వివరించారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.బి.ఎ. విభాగాధిపతి డాక్టర్ ఎం.బి. సువర్చల, ఎం.బి.ఎ. అధ్యాపకులు ఎం.డి.సలీం, వి.విజయకుమారి విద్యార్ధిని, విద్యార్ధులతో అనేక పరిశ్రమల గురించి ముచ్చటించి అభినందించారు.

## స్వచ్ఛతా హి సేవ-ఒక రోజు-ఒక గంట-ఒకేసారి



**గుడివాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘంలో గురువారం స్వచ్ఛతా హి సేవ - ఏక్ దిన్ - ఏక్ గంట- ఏక్ సాత్ (ఒకరోజు- ఒక గంట- ఒకేసారి) కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ జి బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమీషనర్ ఎస్ మనోహర్, అసిస్టెంట్ కమీషనర్ పి శ్రీనివాసరావు, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది, ఆర్డిఓ ఆఫీస్ సిబ్బంది, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ సిబ్బం ది, శానిటరీ మేస్త్రీలు, శానిటేషన్ సూపర్వైజర్లు వాకర్స్ క్లబ్ మెంబర్స్, ఎన్జీఓ లు మరియు పబ్లిక్ ఒక గంట శ్రమదానంలో పాల్గొని ఆర్టీవో ఆఫీస్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సి పల్ కమీషనర్ అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించుట జరిగినది.

## స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం కు పోటెత్తిన ప్రజలు



**విస్సన్నపేట,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో తాతకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన స్వస్తినారి స్వసక్తి పరివార్ వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున గ్రామస్తులకు పరీక్షలు చేయించుకుని మందులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి కే శ్రీనివాసరావు, తెల్లదేవరపల్లి సహకార సంఘం అధ్యక్షులు వీరమాచినేని కృష్ణ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు పులపాక శ్రీనివాసరావు, సర్పంచ్ వెంకటేశ్వరరావు దమ్మాలపాటి సాంబశివరావు, మాజీ అధ్యక్షులు రాజశేఖర్ ఎస్సీ నాయకులు రంగారావు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఉత్సవ కమిటీ చైర్మన్‌లుగా పట్టపు చిన్న, లింగం చిట్టిబాబు లు

### శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానములకు సభ్యుల నియామకం




**గుడివాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** స్థానిక జగన్నాధపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం మరియు బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానములకు విజయదశమిని పురస్కరించుకుని శరన్నవరాత్రి ఉత్సవాలకు కమిటీలను నియమిస్తూ దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్రమోహన్ (ఎఫ్ఎసి) ఉత్తర్వులను విడుదల చేశారు.

**శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో.. :** శ్రీ వేంకటేశ్వస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులుగా లింగం శివరాంప్రసాద్ (చిట్టిబాబు), ఎన్.కృష్ణారావు, సిహెచ్ శ్రీనివాసరావు, జె.రాజేశ్వరరావు, వేదాంతం కృష్ణవేణి, కొడాలి విజయలక్ష్మి, గూడపాటి సుజాత, పి.హేమ, జోగి సాంబశివరావులు నియమితులయ్యారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా లింగం చిట్టిబాబు వ్యవహరించనున్నారు.

**శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానములో.. :** శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానము ధర్మకర్తల మండలి సభ్యులుగా పట్టపు సత్యనారాయణ (చిన్న), పెన్నేరు విశ్వనాధం, తేల్ల సూర్యనారాయణ, డి. నాగరాజు, పివి రమణ, జి.కళ్యాణి, వి.మాధురిలత, వై.సుశీల, మాదాల సునీత, ముప్పిలి ఉమామహేశ్వరరావు, పాతపాటి శ్రీవిద్యలు నియమితులయ్యారు. పట్టపు చిన్న ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

**ఉత్సవ కమిటీ ఛైర్మన్లు చిన్న, చిట్టిబాబులకు పలువురి అభినందనలు.. :** ఉత్సవ కమిటీ ఛైర్మన్లుగా వ్యవహరించనున్న పట్టపు చిన్న, లింగం చిట్టిబాబులను పలువురు టిడిపి నేతలు, కూటమి నేతలు, దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, ఆలయ సిబ్బంది తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్లుగా వ్యవహరించనున్న చిట్టిబాబు, చిన్న లు మాట్లాడుతూ తమకు ఆధ్యాత్మికంగా స్వామివారి సేవల్లో తరించే అవకాశం కల్పించిన శాసనసభ్యులు వెనిగండ్ల రాము, ఏపిఎస్‌డబ్ల్యుసి ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితర టిడిపి కూటమి నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఆయా దేవాలయాల పురోగతికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ముఖ్యంగా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామనీ వారు పేర్కొన్నారు.

## ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకురావాలి:కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** స్వచ్ఛత హి సేవ కార్యక్ర మం ద్వారా పరిశు భ్రత సంస్కృతిని ప్రజల్లో అలవర్చి గ్రామాలు పట్టణాలలో ఆహ్లాదకరమైన పరిశుభ్ర వాతావరణంలో తీసుకుని రావాలని జిల్లా కలెక్టరు ఆర్. మహేష్ కుమార్ పుర జనులకు పిలుపు నిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛోత్సవ్ నేపధ్యంలో స్థానిక పట్టణంలోని సర్క్యులర్ బజార్ నందు నిర్వహించిన ఏక్ దిన్, ఏక్ ఘంట, ఏక్ సాత్ ఒక రోజు, ఒక గంట నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధవి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు మరియు పట్టణ ప్రజలతో కలిసి సర్క్యులర్ బజార్ నందు శ్రమదానం చేశారు ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు అలంకరించి, ఘ నంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది వేసిన స్వచ్ఛత రంగోలిని పరిశీలించి, కార్యక్రమంలో పాల్గొన్న అందరి చేత స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన స్వచ్ఛత ఉద్యమాలలో ఈ కార్యక్రమం ఒకటని,ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం కల్పించడం, కలిపి పని చేయడం ద్వారా పరిశుభ్రతను ప్రోత్సహిస్తూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రధాన ఉద్దేశాలను ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు.వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్, ఓడీఎఫ్ ప్లస్ గ్రామాల రూపకల్పన కమ్యూనిటీ, వివిధ శాఖలు, స్వచ్ఛత మిత్రులు,కార్యాలయాల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. 2025 సంవత్సరంలోని స్వచ్ఛో త్సవ్"అనే ఇతివృత్తంతో శు ద్ధిని ఉత్సవంగా మార్చ దానికి- 17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ వరకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారన్నారు. ఈ భారీ శ్రమదానం కార్యక్రమం ద్వారా ప్రజలు,పుర జనులు పరిశుభ్రత వైపు ముందుకు సాగాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టరు మాట్లా డుతూ పరిశుభ్రతపై అవగాహన చర్యలు బలోపేతం చేస్తూ సామాజిక ప్రవర్తన మార్పు కొరకు సమన్వయంతో పాటు పడాలన్నారు. ప్రజల పాత్ర, ప్రజా సోదరత్వం స్వచ్ఛత హి సేవ క్రియా శీలక కార్య క్రమాలు ప్రజల భాగస్వా మ్యాన్ని ప్రోత్సహిస్తాయ న్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ మున్సి పల్ ,సచివాలయ మెప్మా సిబ్బంది ప్రజా ప్రతిని ధులు పట్టణ పౌరులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలిండియా దాల్ సైనిక్ క్యాంపులో విజయ పరంపర సాగిస్తున్న పి వి పి ఎస్ ఐ టి విద్యార్థులు



**కంకిపాడు, సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** తల్లిదండ్రుల ప్రోత్సాహం కళాశాల సహకారం ఉంటే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ శ్రీవాత్సవ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ కానూరు పివిపి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా దాల్ సైనిక్ క్యాంపులో సత్తా చాటిన బి. రాజ్ దీప్, బి లిఖిత్ లకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ శ్రీ వాత్సవ సైనిక్ క్యాంపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను తల్లిదండ్రులు ప్రోత్సహించి, అధ్యాపకులు సూచనలు చేస్తే విజయం సాధిస్తారు అన్నారు. అసోసియేట్ ఎన్సిపి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం. ధదుర్య నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులు గొప్ప ఫలితాలు సాధిస్తారు అన్నారు, లక్ష్యాన్ని ఎంచుకొని విద్యార్థులు కష్టపడితేనే విజయం సాధిస్తారని సూచించారు. దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా దాల్ సైనిక్ క్యాంపులో 28 రాష్ట్రాల నుంచి పోటీని తట్టుకొని మన రాష్ట్రం నుంచి ఇద్దరు విశిష్ట ప్రతిభ కనబరిచి వీ లిఖిత్ జె.డి.ఎఫ్. ఎస్ లో రజిత పథకాన్ని సాధించడం, జే.ఈ.ఓ లో బి. రాజ్ దీప్ జాతి స్థాయిలో హెల్త్ అండ్ హై జెన్ లో ప్రతిభ కనబరచడం కళాశాలకే అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే.శివాజీ బాబు, కళాశాల హెచ్ ఓ డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎండపల్లి లో స్వచ్ఛత మహోత్సవం




**కృత్తివెన్ను,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** స్వచ్ఛత మహోత్సవ కార్యక్ర మంలో భాగంగా గురువారం ఎండపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఓఎన్జిసి, అవేర్ సంయుక్త ఆధ్వర్యంలో కొబ్బరి, మామిడి మొక్కలను అందజేశారు పర్యావరణాన్ని పరిరక్షించడంలో మొక్కల పాత్ర ఎనలేనిదని సంస్థ ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి ఈసి చరణ్ తేజ్, అవేర్ సంస్థ ప్రతినిధులు పవన్, దినేష్, సర్పంచ్ ప్రభుప్రసాద్ బిజెపి నాయకులు దాసరి వెంకట శ్రీనివాస్ పంచాయితీ కార్యదర్శి లక్ష్మణ్ స్థానికులు పి బాబ్జి తదితరులు ఉన్నారు

## గిద్దలూరు నుంచి రాష్ట్ర రణబేరికి బయలుదేరిన ఉపాధ్యాయులు



**గిద్దలూరు,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** గిద్దలూరు మండలానికి చెం దిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కు చెందిన ఉపాధ్యాయులు ల అధ్యక్షులు పిచ్చయ్య ఆధ్వర్యంలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న రాష్ట్ర రణబేరి కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో గురువారం నాడు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఉ సమస్యలు, ఆర్థిక బకాయిలు, సర్వీస్ సమస్యలను ప్రభుత్వం పరిష్క రించకుండా మొండి వైఖరి విధానాన్ని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 6000 మంది ఉపాధ్యాయులు పాల్గొనరున్నారని పిచ్చయ్య తెలిపారు.

## శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం కు ఆధ్యాత్మిక ఎనౌన్స్ మెంట్ క్లాక్ బహుకరించిన శ్రీరామ ఉత్సవ కమిటీ



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి హనుమాన్ జంక్షన్ శ్రీరామ ఉత్సవ కమిటీ తరుపున హిందూ దేవాలయ గంట ( గంటకు ఒకసారి టైం ) ఒక భగవద్గీత శ్లోకం దాని యొక్క తాత్పర్యం రికార్డింగ్ చెప్తుంది. ఇందులో భాగంగా శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు తవ్వా పూర్ణ చంద్రరావు, నూకల బాలాజీ, నూకల రాఘవరావు, మంచం రాఘవ, పల్లపు అంకమ్మ బాబు, వడ్డి విజయ్, సత్యమణి తదితరులు పాల్గొనారు.

# అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సేవలు

- వరల్డ్ హార్ట్ డే నేపథ్యంలో పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రత్యేక కార్యక్రమాలు
- ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు స్పెషల్ కార్డియాలజీ ప్యాకేజ్
- ఈ నెల 28న అవనిగడ్డలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు
- పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ అధినేత, ప్రఖ్యాత ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు
- 'కార్పొరేట్ క్వాలిటీ.. ఆన్ అఫర్డబుల్ రియాలిటీ' మూలసూత్రంతో ప్రజలకు ప్రపంచ శ్రేణి వైద్య సేవలందిస్తున్నాం
- పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ సీఈవో, ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆకాశ్ పల్లెం





**విజయవాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ వైద్య సేవలను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ అధినేత, ప్రఖ్యాత ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు తెలియజేశారు. సూర్యారావుపేటలోని పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలతో, అత్యంత అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో తమ హాస్పిటల్ దాదాపు మూడు దశాబ్దాలుగా సేవలందిస్తోందని వెల్లడించారు. 'కార్పొరేట్ క్వాలిటీ.. ఆన్ అఫర్డబుల్ రియాలిటీ' అనే మూల సూత్రంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అత్యాధునిక వైద్య చికిత్సలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ వరల్డ్ హార్ట్ డే నేపథ్యంలో పలు ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు ప్రకటించారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు, వారం రోజుల పాటు స్పెషల్ కార్డియాలజీ ప్యాకేజ్ ను అందుబాటులో తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ ప్యాకేజ్ లో భాగంగా కేవలం రూ.600లకే ఈసీజీ, ఎకో, ఆర్బీఎస్, హిమోగ్లోబిన్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతో పాటు, కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ సదుపాయం లభిస్తుందని వివరించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అందిస్తున్న ఈ స్పెషల్ హార్ట్ ప్యాకేజీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పెద్దేశ్వరరావు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులో తేవాలనే సంకల్పంతో ఈ నెల 28న కృష్ణాజిల్లా అవనిగడ్డలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరం ద్వారా దివిసీమలోని వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలందిస్తామని అన్నారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, పల్మనాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఈఎన్టీ తదితర 20 విభాగాల వైద్య నిపుణులు ఈ శిబిరంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ సుందర శివాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం, పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ సీఈవో, ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆకాశ్ పల్లెం మాట్లాడుతూ.. సామాన్య ప్రజలపై ఆర్థిక భారం లేకుండా కార్పొరేట్ వైద్య సేవలను అందించడమే తమ హాస్పిటల్ ప్రధాన లక్ష్యమని అన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ విభాగాలతో ఈ ప్రాంతంలో అతిపెద్ద అత్యవసర చికిత్సా కేంద్రంగా పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ సేవలందిస్తోందని డాక్టర్ ఆకాశ్ వెల్లడించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రవేశపెట్టిన స్పెషల్ హార్ట్ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ స్పెషల్ ప్యాకేజీకి సంబంధించిన బ్రోచర్లను హాస్పిటల్ వైద్యులతో కలిసి డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు, డాక్టర్ ఆకాశ్ పల్లెం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డాక్టర్ సిహెచ్. ప్రసాద్ బాబు, డాక్టర్ సింధు చాగంటి, డాక్టర్ బి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కారవాన్ టూరిజం అభివృద్ధికి శుభారంభం

## – ఏపీ టూరిజం ఛైర్మన్ డా. నూకాసాని బాలాజీ




**విజయవాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏపీ టూరిజం ఛైర్మన్ డా. నూకాసాని బాలాజీ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ , మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి కాటా, ఓజేఐ కారవాన్ ప్రతినిధులు మరియు ఇతర శాఖాధికారులతో కలిసి విజయవాడలోని టూరిజం కార్పొరేట్ కార్యాలయంలో ఓజేఐ కారవాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ డా. బాలాజీ మాట్లాడుతూ కారవాన్ టూరిజం యొక్క ప్రత్యేకతలను మరియు వీటి ద్వారా పర్యాటక రంగానికి వచ్చే అవకాశాలను వివరంగా ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో కారవాన్‌లు ప్రవేశపెట్టడం ద్వారా దేశీ మరియు అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కారవాన్ టూరిజం ద్వారా పర్యాటకులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించడం మరియు అణచివేతలో ఉన్న పర్యాటక ప్రదేశాలను వెలికితీయడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఓజేఐ కారవాన్ యూనిట్స్ ఆధునిక సౌకర్యాలతో రూపొందించబడి, పర్యాటకుల అవసరాలను తీర్చగలగడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు, ఓజేఐ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కారవాన్ టూరిజానికి అన్ని విధాలుగా మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉందని, త్వరలోనే కొన్ని ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాల్లో ఈ సదుపాయాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. కారవాన్ టూరిజం ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించనుంది.

# సమాజాభివృద్ధికి మూల స్తంభాలు మహిళలే -కోయ సుధా

## -ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో ఆర్థిక స్వాలంబన- మహిళ సాధికారతపై అవగాహన సదస్సు





**మైలవరం,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** మహిళలు సమాజాభివృద్ధికి మూల స్తంభాలు అనీ, వారిని ఆర్థికంగా తీర్చిదిద్దినట్లయితే కుటుంబము,సమాజం యావత్తు దేశం పురోగతిని సాధించవచ్చు అని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా అన్నారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర విభాగం మరియు వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మహిళ ల ఆర్థిక స్వాలంబన, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహాపరిశ్రమలు అనే అంశం పై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కోయా సుధా ప్రసంగించారు. అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ షేక్ కరీముల్లా మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ప్రభుత్వం విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించటం, విద్యార్థులను నైపుణ్యాలు మరియు ఆవిష్కరణల వైపు దృష్టి సాధించడం ద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, జి.నారాయణరావు, కె.హరి బాబు, డి.శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధులకు కొండంత అండ, ఆసరా గా నిలుస్తున్న బీ.కే.ఆర్. వృద్ధాశ్రమం






**గన్నవరం,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** గన్నవరం పట్టణంలో బస్టాండ్ సమీపంలో రీచ్ ప్రాంగణం నందు బి. జి.ఆర్.వృద్ధాశ్రమం 3వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి దంపతులు విచ్చేసి వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ వృద్ధులే కుటుంబ చారిత్రక ఆనవాళ్లు, వారి సంరక్షణ ఎంతో ముఖ్యం. గత 10 సంవత్సరాల నుండి వృద్ధుల సంరక్షణకు కట్టుబడి, వారికి బాసటగా నిలుస్తూ నేడు సకల హంగులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో బీ.కే.ఆర్. వృద్ధాశ్రమం 3 వ బ్రాంచ్ ను గన్నవరంలో ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. వృద్ధాశ్రమంలో కార్యాలయాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ వృద్ధుల సేవే పరమావధిగా అకుంఠిత దీక్షతో ఆశ్రమాన్ని 10 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కానూరి శేషు మాధవి సేవలు ఆదర్శవంతమని అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ చైర్మన్ కానూరి శేషు మాధవి మాట్లాడుతూ ఆశ్రమంలో వృద్ధులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడానికి సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎల్లపుడూ ఆరోగ్య సేవలు అందుబాటు లో ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారం, నీరు, శుభ్రమైన వాతావరణంలో ఇతర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ కే ఆర్ వృద్ధాశ్రమం కార్యదర్శి సత్య వేద కుమార్ (ఖన్నా) ,సమరసత సేవా సంస్థ అధ్యక్షుడు పాకాల త్రినాథ్ , బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాదిండ్ల మోహన్, నీటి సంఘాల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుడు నీలం అశోక్, పోలవరపు అనిల్, తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు ఆహ్వానితులకు ఆశ్రమ వైస్ చైర్మన్ బొకినాల అశోక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమం...






**పెనుగంచిప్రోలు,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని పాత సినిమా హాల్ సెంటర్ వద్ద ఉన్నటువంటి ఆర్ కె. ఫంక్షన్ హాల్ నందు గురువారం సాయంత్రం 5 గంటలకు జయప్రద ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జయప్రద ఫౌండేషన్ చైర్మన్,మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ , జయ ప్రద పౌండేషన్.సి వో. చెరుకూరి. చాముం డే శ్వరి, డాక్టర్.జానీ బాషా, డాక్టర్ హరి ప్రసాద్, బోడేపూడి, అమర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రద పౌండేషన్ చైర్మన్ తొండపు జనార్ధన్ మాట్లాడుతూ ఈ పెనుగంచిప్రోలు గ్రామం కు కావ్వే కొరకు అప్పటి ఇపుడున్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబుతో మాట్లడి 7 కోట్లు మంజూరు చేశారన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం లో అభివృద్ధి కోసం ఎప్పుడు పనిచేయటానికి సిద్ధం గా ఉంటానని తెలిపారు. అలాగే ఈ జయప్రద పౌండేషన్ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పెనుగంచిప్రోలు గ్రామం లోకంటి చూపు 5 వందల మందికి లోపించిందనీ, అందుకె 5 వందల మందికి కళ్ళ జోళ్ల పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ కోఆర్డనేటర్ కట్టా. నసింహారావు, మాజీ ఎంపిపి వేగినేటి. గోపాల కృష్ణ మూర్తి,కర్ల వెంకటనారాయణ,మాజీ జెడ్ పిటిసి గజ్జి కృష్ణ మూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు,మండల స మై ఖ్య అధ్యక్షురా లు. కర్ల. కోటేశ్వరి. కల్లూరి. శ్రీవాణి. తునికి పాటి. శివా. గ్రామ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఫలించిన సానా సతీష్ బాబు ఫౌండేషన్




**కాకినాడ,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో సానా సతీష్ బాబు ఫౌండేషన్ చేసిన కృషి ఫలించింది. కాకినాడ మెయిన్ రోడ్డులో గల జిల్లా గ్రంథాలయ సంస్థలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మౌలిక సదుపాయాలు లేవని తెలుసుకున్న ఫౌండేషన్, ఒక కంప్యూటర్‌తో పాటు సుమారు రూ.45 వేల విలువైన డీఎస్సీ , ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందించింది. ఈ సదుపాయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో 16 మంది అభ్యర్థులు విజయాలు సాధించగా, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో 9మంది ఎంపికయ్యారు. అమరావతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో విజేతలకు నియామక పత్రాలు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులు తమ విజయంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ అందించిన సహకారం ఎంతో మేలు చేసిందని, అందుకు గాను ఎంపీ సానా సతీష్ బాబుకు, వారి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ,అభ్యర్థులు సాధించిన ఈ విజయం నాకు గర్వకారణం. ఇది మరెందరో యువతకు ప్రేరణాత్మకంగా నిలుస్తుంది,అని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్ మాట్లాడుతూ, సానా సతీష్ బాబు ఫౌండేషన్ అందించిన పుస్తకాలు, సదుపాయాల వల్లే నేడు గ్రంథాలయంలో కష్టపడి చదివిన విద్యార్థులు డీఎస్సీ,కానిస్టేబుల్ పరీక్షల్లో విజయం సాధించారు. ఇందుకు ఎంపీ సానా సతీష్ బాబుకి, ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు,అని తెలిపారు.

# విజయోత్సాహంలో కేక్ కట్ చేసిన జనసైనికులు



**కంకిపాడు,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు లోని విజయలక్ష్మి థియేటర్ వద్ద జన సైనికులు విజయోత్సాహంతో కేక్ కట్ చేశారు. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఓ జీ సినిమా గురువారం రిలీజ్ అయింది ఉదయం నుంచి పాజిటివ్ టాక్ తో అభిమానులతో థియేటర్ కిక్కిరిసి పోయింది. ఎయిర్పోర్ట్ సభ్యులు ముప్పా రాజా ఆధ్వర్యంలో జనసైనికులు కేక్ కటింగ్ చేసి, టపాసులు కాల్చి విజయోత్సవ ఆనందాన్ని వెళ్ళ పరిచారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు సుంకర శివ, జనసేన నాయకులు బోయిన నాగరాజు, శేఖర్, జగదీష్, రవి, సుంకర్ సురేష్, టిడిపి నాయకులు కొప్పురాజు సురేష్, ఏనుగు జయప్రకాష్, పచ్చిపాల రాజా పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది-కొల్లి నాగేశ్వరరావు



**జి.కొండూరు,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని, 150 రోజుల వ్యవధిలోనే డీఎస్సీ పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం హర్షనీయమని భారతీయ జనతా పార్టీ (బిజెపి) విభాగం రాష్ట్ర టీచర్స్ సెల్ కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఇది ఒక శుభవార్త అని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మొదటిది మెగా డీఎస్సీ అని, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాలు అందజేయడం శుభపరిణామం అన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు కొల్లి నాగేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

# 34 లక్షల మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

- 2వరకు శిబిరాలు కొనసాగింపు
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- నున్న లో ఉచిత వైద్య శిబిరం సందర్శన





**విజయవాడ రూరల్,సెప్టెంబరు 25 (వార్తాప్రభ) :** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ప్రారంభమైన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా సుమారు 34 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 16,000 పైగా వైద్య శిబిరాల ద్వారా మహిళలు ఉచిత పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. మహిళలు 8 రకాల ఉచిత పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నున్నలో ఏర్పాటు చేసిన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" వైద్య శిబిరాన్ని మంత్రి గురువారంనాడు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్), ఇతర స్క్రీనింగ్ పరీక్షలను చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు పరీక్షల ద్వారా అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిబిరాల ద్వారా మహిళలు, చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటిన్నర మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వస్థ్ నారి అంటే ఆరోగ్యవంతమైన మహిళ అని, సశక్త్ పరివార్ అంటే ఒక శక్తివంతమైన కుటుంబంలో అత్యంత ముఖ్య భూమిక పోషించే మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా తయారవుతుందని మంత్రి వివరించారు.

**క్యాన్సర్ పరీక్షలు..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నోటి క్యాన్సర్ పరీక్షలు, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికీ రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, 30 ఏళ్లు నిండిన ప్రతి మహిళకీ సర్వైకల్ క్యాన్సర్ పరీక్షల్ని ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సూపర్ స్పెషలిస్ట్ లు, స్పెషలిస్టులు, ఎఎన్ఎంలు దాదాపు 18 వేల మంది రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. 24 గంటలూ పనిచేసే శాఖ ఏదైనా ఉందా అంటే అది ఒక్క వైద్యారోగ్య శాఖే అని, చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

**ఎన్టీఆర్ అంతటివారు పండిట్ దీన్ దయాళ్..** మాజీ సిఎం ఎన్టీ రామారావు గురించి గొప్పగా ఎలా మాట్లాడుకుంటామో.... ఉత్తరాదిలో ఏ రాష్ట్రానికెళ్లినా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గురించి అలా చెప్పుకుంటారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కుటుంబం కన్నా దేశహితం ముఖ్యమని, దేశంలో ఉంటున్న కోట్లాది ప్రజల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమని ఆయన భావించారన్నారు. ఈ దేశంలో ఆర్థిక సంస్కరణలు పేదవారిని దృష్టిలో పెట్టుకొని తీసుకురావాలని మొట్టమొదట చెప్పిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశం కోసం పని చేయాలన్న ఉద్దేశంతో జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నున్న గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, గంపా శ్రీనివాస్ యాదవ్ , కందులు లీలా కృష్ణ యాదవ్ మాదు శివరాం ప్రసాద్, చల్లా మాల్యాద్రి , ఢిల్లీ కోటేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188